
కురవి: వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ డీఈ విజయ్

వినియోగదారులు సహకరించాలి

కురవి, అక్టోబర్ 11 : కురవి మండలం బలపాల శివారు లింగ్యాతండాలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం ప్రత్యేక అవగాహన సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డీఈ విజయ్ మాట్లాడుతూ... ప్రభుత్వం వినియోగదారులకు నాణ్యమైన సేవలందించేకు కృషి చేస్తున్నదన్నారు. విద్యుత్ చౌర్యం నేరమని, ఇప్పుడు ప్రభుత్వం వినియోగదారులకు రూ.938కే మీటరు అందిస్తున్నదన్నారు. ప్రతి ఇంటికి మీటరు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ రమేశ్, ఏఈ శారద, జంపీరావు, గ్రామ మాజీ సర్పంచ్ రాంలాల్, లింగ్యానాయక్ పాల్గొన్నారు.

వీరన్నను సన్మానిస్తున్న యాదవ కులస్తులు

బీసీల అభివృద్ధికి కృషి చేస్తా

రాష్ట్ర ఓబీసీ చైర్మన్ మేకల వీరన్న యాదవ్

కేసముద్రం, అక్టోబర్ 11 : తెలంగాణ రాష్ట్రంలోని బీసీల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర ఓబీసీ చైర్మన్ మేకల వీరన్నయాదవ్ అన్నారు. రాష్ట్ర ఓబీసీ చైర్మన్‌గా నియామకమైన ఆయనను శుక్రవారం మండలకేంద్రంలో యాదవ కులస్తులు ఘనంగా సన్మానించారు. కేసముద్రం విలేజ్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోళ్ల ముత్తయ్య, కోడి కుమార్, పెద్దబోయిన రాజశేఖర్, ఎలగలబోయిన రాజశేఖర్, కాడబోయిన కృష్ణ, కుమారస్వామి, ఉపేందర్ పాల్గొన్నారు.

హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తా

వేం నరేందర్‌రెడ్డి

వేం నరేందర్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య

గార్ల, అక్టోబర్ 11 : రాంపురం వద్ద పాకాల ఏరుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానని సీఎం ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆయనను కలిసి మాట్లాడారు. పాకాల ఏరుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలని కోరగా.., ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎమ్మెల్యే సీఎం కా ర్యాలయంలో ఐపీఎస్ అధికారి వీ శేషాద్రిని కలిసి వానకాలంలో తన 15 గ్రామాల ప్రజలు పడుతున్న అవస్థలను ఆయనకు వివరించి, త్వరలో హై లెవల్ బ్రిడ్జిని నిర్మిం చాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి మంజూరీ లభిం చిందని, నిధులు మాత్రం విడుదల కాలేదన్నారు. ఎమ్మెల్యే వెంట గార్ల మండలం పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331785-All

WANTED HOSPITAL STAFF
★PHARMACY BOYS (మందుల షాపు), OT BOYS (ఆపరేషన్ థియేటర్), SUPERVISIORS (Administrators) & LAB TECHNICIANS కావలెను. సంప్ర : గార్డియన్ హాస్పిటల్, వరంగల్. 2 to 4 PM.
NTW-0436

PLOT FOR SALE

★యాదగిరిగుట్ట, వంగపల్లిలో గేటెడ్ కమ్యూనిటీ యందు బ్యాంక్ లోన్ సౌకర్యంతో ఓపెన్ ప్లాట్లు కలవు. రిసార్ట్స్, స్విమ్మింగ్ పూల్, పార్క్ అన్ని వసతులతో. Contact: 8106340199.
NT-333076

SHUTTERS FOR SALE
★హనుమకొండ చౌరస్తా మహేంద్ర క్లాత్ షోరూం ప్రక్కన గల్లీలో SSN Reddy కాంప్లెక్స్ నందు 1st ఫ్లోర్‌లో 3 కమర్షియల్ షట్టర్స్ అమ్మకానికి కలవు. సంప్ర॥ సెల్: 8686778662.
NTW-326423

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

మసీదు సెంటర్‌లో జాతీయ జెండా

- ఏటా దసరా పండుగ రోజున గార్ల మండలకేంద్రంలో ఆవిష్కరణ
- నిజాం కాలం నుంచి వస్తున్న ఆనవాయితీ..
- నేడు ఎగురవేయనున్న మండల ప్రత్యేకాధికారి

జెండాను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ బన్సీలాల్ (ఫైల్)

గార్ల, అక్టోబర్ 11 : దసరా పండుగ రోజు మండల కేం ద్రంలోని మసీదు సెంటర్‌లో ఎంపీడీవో, మండల ప్రత్యే కాధికారి మంద మంగమ్మ జాతీయజెండాను ఆవిష్కరించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేశారు. నిజాం కాలంలో నిజాం నవాబు ప్రతి దసరాకు నెలవంక కలిగిన నీలిరంగు జెండాను ఎగురవేసేవారు. నిజాం కాలం అంతరించిన తర్వాత కూడా ఈ ఆనవాయితీ కొనసాగుతున్నది. ప్రతి ఏటా దసరా పండుగ రోజున గార్ల మసీద్ సెంటర్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా విజయ దశమి రోజు జాతీయ జెండాను ఎగరేసే సంప్రదాయం గత 60ఏండ్లుగా కొనసాగుతున్నది. కాగా, 1952లో గార్ల టౌన్ మున్సిపాలిటీకి కాంగ్రెస్ పార్టీ తరపున చైర్మన్‌గా మాటేటి కిషన్‌రావు ఎన్నికయ్యారు. నాడు దసరా రోజున మసీదు సెంటర్‌లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తుండగా కమ్యూనిస్టులు, కాంగ్రెస్ నాయకులకు మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ విషయమై అప్పట్లో హైకోర్టుకు వెళ్ల గా, దేశభక్తికి చిహ్నంగా, మతసామరస్యానికి ప్రతీకగా దసరా రోజున జాతీయ జెండాను ఎగురవేయాలని కోర్టు తీర్పునిచ్చింది. దీంతో అప్పటి నుంచి ఇదే ఆనవాయితీని కొనసాగిస్తున్నారు.నాటి నుంచి గార్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఎవరు ఉంటే వారు మసీద్ సెంటర్‌లో జాతీయ జెండా ఎగురవేస్తున్నారు. తొలుత గ్రామ సర్పంచ్‌ను గుర్రంపై కూర్చోబెట్టి వీధుల్లో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహిస్తారు. అనంతరం జాతీయ జెండాను ఎగరేస్తారు. అనంతరం ఆంజనేయస్వామి గుడిలో షమీ పూజ నిర్వహించి, పాలపిట్టను సందర్శిస్తారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ప్రజలు, రైతుల్లోతీవ్ర వ్యతిరేకత
- పీఏసీఎస్ డైరెక్టర్ శీలంశెట్టి ప్రవీణ్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్

గార్ల, అక్టోబర్ 11 : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారిందని పీఏసీఎస్ డైరెక్టర్ శీలంశెట్టి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి రెండు నెలలైనా ఎవరూ పట్టించుకోకపోవడంతో రైతులు వ్యవసాయ పనులు చేసుకోలేక అవస్థలు పడుతున్నారని అన్నారు. దేశానికి అన్నంపెట్టే రైతులకు కరెంట్ ఇవ్వకుండా.., రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద డబ్బులు దండుకొని ఖాళీ స్థలాల్లో విద్యుత్ స్తంభాలు వేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ అధికారుల తీరుతో ప్రజలు, రైతుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వస్తున్నదని వివరించారు. విద్యుత్ అధికారుల అవినీతికి సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని, వాటిని ఉన్నతాధికారులకు అందజేశామన్నారు. మండలంలో చాలాచోట్ల కరెంటు వైర్లు కిందికి వేలాడుతున్నాయని, అవి తగిలి ఆరు బర్రెలు, యువకుడు మృతిచెందినట్లు తెలిపారు. 50 ఏండ్ల నుంచి ఏటి వద్దకు కరెంటు స్తంభాలు ఉన్నాయని, ప్రస్తుత ఏఈ మహేంద్రబాబు అలా ఉండడానికి వీలు లేదంటూ రైతులను ఇబ్బందిపెడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై విద్యుత్ ఏఈని వివరణ కోరగా పాకాల ఏరు లోపలి వరకు విద్యుత్ స్తంభాలు వెయొద్దని ఉన్నతాధికారుల ఆదేశాలు పంపించారని వివరించారు. రోడ్డు నుంచి పాకాల ఏరు వరకు సర్వీస్ వైరు అమర్చుకోవాలని సూచించారు. ఈ విషయమై విద్యుత్ ఎస్ఈ నరేందర్‌ను ఫోన్‌లో వివరణ కోరగా తాను పాకాల ఏరు లోపలి వరకు విద్యుత్ స్తంభాలు వేయొద్దని చెప్పలేదన్నారు.

పురస్కారాలు పొందిన విద్యార్థులు, ఉద్యోగులు

పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

తొర్రూరు, అక్టోబర్ 11: పద్మశాలి విద్యార్థులు చదువునే ఆయుధంగా మలుచుకొని భవిష్యత్‌లో ఉన్నతస్థానాలకు ఎదగాలని ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని వందేమాతరం ఫౌండేషన్‌లో పోపా ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పద్మశాలి ప్రతిభ పురస్కారాలను అందజేశారు. బుదారపు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంబీబీఎస్, ఇంజినీరింగ్, ఇంటర్, ఎస్ఎస్‌సీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చూపిన 25 మంది పద్మశాలి విద్యార్థులను సత్కరించారు. ఈ సంవత్సరం ఉద్యోగాలు సాధించిన 14 మంది ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల పద్మశాలి ప్రతినిధులు డాక్టర్ కూరపాటి రమేశ్, డాక్టర్ చందా మల్లయ్య, డాక్టర్ పరికిపండ్ల అశోక్, పెండెం రమేశ్, వెంకన్న, వెంకటేశ్వర్లు, పులేందర్, యాకన్న, నాగేశ్వర్, రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

కురవి : వరద బాధితులకు పరిహారం అందజేస్తున్న నాయకులు

వరద బాధితులకు పరిహారం అందచేత

కురవి, అక్టోబర్ 11 : ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామంలో నష్టపోయిన సింగారపు నర్సమ్మ, వడ్లకొండ పకీరమ్మ, వెంకటమ్మ, బొల్లు స్వరాజ్యానికి డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ సహకారంతో ఒక్కొక్కరికి రూ.16,500 చొప్పున శుక్రవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గంట హరీశ్, జలికె శ్రీనివాస్, జలికె కుమారస్వామి, వేమిశెట్టి ప్రసాద్, బొల్లు వెంకన్న, తొడుసు ఐలయ్య, దూదిమెట్ల లింగన్న, నర్సింగం వీరన్న, గడ్డం ఉపేందర్, జిన్నె మహేశ్, గజ్జి శ్రీనివాస్, నర్సింగం వెంకన్న, యాకన్న పాల్గొన్నారు.

ఎల్ ఆర్ఎస్‌ను పూర్తి చేయాలి

మరిపెడ, అక్టోబర్11 : ఎల్ఆర్ఎస్‌ను త్వరగా పూర్తిచేయాలని తహసీల్దార్ సైదులు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అబ్బాయిపాలెం పరిధిలోని భూములను రెవెన్యూ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామం నుంచి ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని, డాక్యుమెంట్లు పరిశీలించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీవో సోంలాల్, అశోక్ ఉన్నారు.


ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేస్తున్న కాచనపల్లి గ్రామస్తులు

సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే కోరం కనకయ్యకు గ్రామస్తుల వినతి

బయ్యారం, అక్టోబర్ 11 : సమస్యలను పరిష్కరించాలని కాచనపల్లి గ్రామ ప్రజలు శుక్రవారం ఇల్లందులో ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. కిష్టాపురం, కాచనపల్లి, మూలపోచారం, రామన్నపేట పరిధిలో సుమారు 950 కుటుంబాల్లో 1500 మంది జనాభా ఉండగా, 450 మంది పింఛన్‌దారులు ఉన్నట్లు తెలిపారు. కానీ, పోస్టాఫీస్‌లేక పోవడంతో ప్రతి నెలా 20 కిలోమీటర్లు వెళ్లి పింఛన్ తెచ్చుకోవాల్సి వస్తున్నదని వృద్ధులు ఆవేదన చెందారు. అదేవిధంగా వానకాలంలో గర్భిణులను దవాఖానకు తీసుకెళ్లాలంటే సమయాభావం వల్ల ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తననీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బత్తిని రామ్మూర్తి, పర్షిక రాజు, గ్రామస్తులు సాంబశివరావు, లక్ష్మీనారాయణ, సంతోష్, యూసుఫ్, ప్రసాద్, ప్రవీణ్, రాజకుమార్, కిరణ్, రాజేశ్, సంతోష్ పాల్గొన్నారు

పోయిన సెల్ ఫోన్‌ను అప్పగింత

నర్సింహులపేట, అక్టోబర్ 11 : మండల కేంద్రంలో ఒకరు పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను పోలీసులు 24 గంటల్లో కనిపెట్టి బాధితుడికి అప్పగించిన ఘటన శుక్రవారం మండలంలో జరిగింది. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. తొర్రూరుకు చెందిన ఎండీ పాషా అనే వ్యక్తి మండల కేంద్రంలో సెల్‌ఫోన్ పోగోట్టుకున్నాడు. పాషా ఫిర్యాదు మేరకు ఫోన్‌ట్రాక్ చేసిన పోలీసులు మండలంలోని ఫకీరతండాలో ఉన్నట్లు కనుగొన్నారు. ఫోన్‌ను పాషాకు అప్పగించారు.

నర్సింహులపేటలో సెల్‌ఫోన్‌ను బాధితుడికి అప్పగిస్తున్న ఎస్సై సురేశ్

జీపీ కార్మికులకు దుస్తుల పంపిణీ

ఇనుగుర్తి, అక్టోబర్11 : మండల కేంద్రానికి చెందిన జీపీ కార్మికులకు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ నిధులు రూ.12వేలతో 18 మంది కార్మికులకు దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, బిల్ కలెక్టర్ మధుసూదన్, రాములు, ఎల్లయ్య, భిక్షం, యాకమ్మ, యాకలక్ష్మి, ప్రసాద్, దర్గయ్య పాల్గొన్నారు.

దుస్తులను చూపిస్తున్న జీపీ కార్మికులు

పనిచేసే చోట గుర్తింపు సాధించాలి

మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

చిన్నగూడూరు, అక్టోబర్ 11: ఉద్యోగులు పనిచేసేచోట గుర్తింపు పొందాలని మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన హీర్యానాయక్ ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం రెండా మాట్లాడుతూ.. ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిద్ది ఆదర్శంగా నిలిచాడన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాంసింగ్, ఆయూబ్‌పాషా, మల్లేషం, గంగరాజు,శివయ్య, మల్లయ్య, శంకర్, సత్యనారాయణ ఉన్నారు.

ప్రజలకు దసరా శుభాకాంక్షలు: మాజీ ఎంపీ కవిత

ఉగ్గంపల్లిలో చిన్నారులతో కలిసి క్రికెట్ ఆడుతున్న కవిత

చిన్నగూడూరు, అక్టోబర్11 : జిల్లా ప్రజలందరికీ మహబూబాబాద్ మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఆమె ఉగ్గంపల్లిలో తాను పుట్టిన ఊరిలో చిన్నారులతో కలిసి సరదాగా గడిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలు నిదర్శనమన్నారు. దసరా వేడుకలను సంప్రదాయ పద్ధతిలో ఘనంగా జరుపుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

కోతి మృతదేహాన్ని పూడ్చివేస్తున్న కురవి యువకులు

వానరానికి అంత్యక్రియలు

మానవత్వం చాటుకున్న యువకులు

కురవి, అక్టోబర్ 11 : కురవి మండల కేంద్రంలోని గుడిసెంటర్‌లో శుక్రవారం విద్యుదాఘాతంతో కోతి మృతిచెందింది. మిగతా కోతులన్నీ గుంపుగా చేరాయి కానీ, మృతిచెందిన కోతి నుంచి కరెంటు తీగను వేరుచేయలేక పోయాయి. గుడిసెంటర్‌లో ఉంటున్న కర్నం ముత్తయ్య, బొమ్మగాని అనిల్, బదావత్ రత్తు, నిమ్మశెట్టి రాంచంద్రు గమనించి, కోతి మృతదేహాన్ని తీసుకొచ్చి, శ్మశాన వాటికలో ఖననం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

11 కేవీ ఫీడర్ డిస్క్ ఫెయిల్

అందుకే విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్11 : తొర్రూరు మండలం వెంకటాపూర్‌లో ఈ నెల 10న గురువారం 11కేవీ విద్యుత్ ఫీడర్ ఫెయిల్ కావడంతో దానిని రిపేర్ చేయించడానికి గంటన్నర సమయం పట్టిందని, అందుకే కరెంట్ సరఫరాలో అంతరాయం కలిగిందని ఎస్ఈ నరేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరెంట్ అంతరాయం వల్ల బతుకమ్మ ఆడే మహిళలకు అసౌకర్యం కలిగిందని, తమ సిబ్బందితో వెంటనే మరమ్మతు చేయించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామన్నారు. అదేవిధంగా బయ్యారం పట్టణంలోని ఎమ్మార్వో సెంటర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఫీజును మార్చేందుకు, కొత్తపేట టౌన్‌లోని పీడర్ వర్షం కారణంగా ఫీజు ఆఫ్ కాగా, దానిని రిపేర్ చేయించేందుకు విద్యుత్ సరఫరాను నిలిపివేశామన్నారు. అధికా రులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి మరమ్మతు పనులు పూర్తి చేయడంతో విద్యుత్‌ను అందించామని తెలిపారు.

ఖాళీలను పారదర్శకంగా చూపాలి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 11 : నూతన ఎంపికైన ఉపాధ్యాయులకు వివిధ పాఠశాలల్లో ఖాళీలను పారదర్శకంగా చూపాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం డీఈవో కార్యాలయంలో పరీక్షల అధికారి శ్రీరాములుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జిల్లాలో ఎలాంటి అవకతవకలు లేకుండా ఖాళీలను నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో హరినాయక్, రాజు, రవీందర్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపక పోస్టుల భర్తీ

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 11 : జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న కాంట్రాక్ట్ అధ్యాపక పోస్టులను భర్తీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత జూలై నెలలో అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల మెరిట్ జాబితాను ఈ నెల 15 ప్రకటిస్తామని, ఎంపికైన అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఈ నెల 16న ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని డీఈవో పేర్కొన్నారు.

ఫొటోగ్రఫీ పోటీలకు ఆహ్వానం

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 11 : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ఫొటోగ్రాఫర్లు, షార్ట్‌ఫిల్మ్‌లపై ఆసక్తి ఉన్న యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. పోలీసుల త్యాగాలు, ప్రతిభపై ఇటీవల కాలంలో తీసిన ఫొటోలు, షార్ట్‌ఫిల్మ్‌లతో ఈ నెల 20న జిల్లా కార్యాలయానికి హాజరు కావాలన్నారు. మరింత సమాచారం కోసం 7702513469 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

358 మంది అభ్యర్థులు రిపోర్ట్

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 11 : 2024 డీఎస్సీ ఫలితాల్లో జిల్లాలో 358 ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అభ్యర్థులు ఎంపికయ్యారని, వీరందరూ హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలు అందుకున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు అభ్యర్థులందరినీ జిల్లాల వారీగా రిపోర్ట్ చేయాలని ఆదేశించడంతో రెండు రోజుల్లో మొత్తం 358 మంది అభ్యర్థులు డీఈవో కార్యాలయంలో రిపోర్ట్ చేశారని తెలిపారు.

విజయ దశమి శుభాకాంక్షలు

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 11 : జిల్లా ప్రజలకు విజయ దశమి శుభాకాంక్షలను కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని, పూలను పూజించే సంస్కృతి కేవలం ఇక్కడే ఉందని, ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోవాలని పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి

కేసముద్రం : పెనుగొండ గ్రామంలో శుక్రవారం ఒకరు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లాకు చెందిన లక్క ప్రశాంత్(30), ఆయన భార్య అమీనాకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఉపాధి కోసం నాలుగు నెలల క్రితం కేసముద్రం మండలం పెనుగొండ గ్రామానికి వచ్చారు. అక్కడే నివాసముంటున్నారు. ప్రశాంత్ భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్నాడు. కాగా, ఈ నెల 10న ప్రశాంత్, అమినా మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన ప్రశాంత్ శుక్రవారం ఉదయం ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన చుట్టు పక్కల వాళ్లు ఆటోలో మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందడంతో వైద్యులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి, విచారణ చేస్తున్నట్లు ఎస్సై మురళీధర్‌రాజు తెలిపారు. భార్య తన బంధువుల సహాయంతో హత్య చేసి ఉంటుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బెలగావి ఎక్స్‌ప్రెస్ పునరుద్ధరణ

డోర్నకల్ : ఈ నెల 16న నుంచి బెలగావి ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరించనున్నట్లు రైల్వే ఉన్నతాధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబర్ 07335/07336 బెలగావి–మణుగూరు, మణుగూరు–బెలగావి వరకు ఈ నెల 16 నుంచి 2025 మార్చి 30 వరకు నడుపుతామన్నారు.

దుర్గామాతకు ఎమ్మెల్యే పూజలు

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 11 : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మున్సిపాలిటీలోని 28వ వార్డులో ఏర్పాటు చేసిన దుర్గామాతకు శుక్రవారం ఎమ్మెల్యే మురళీనాయక్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు భరత్‌చంద్రారెడ్డి, రాజు, రమేశ్, శ్రీను, భాస్కర్ పాల్గొన్నారు.

దివ్యాంగ బాలికకు వీల్ చైర్ అందజేత

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 11 : సీరోలు గ్రామానికి చెందిన కన్నబోయిన శ్రావ్య అనేక బాలిక పుట్టుకతోనే దివ్యాంగురాలు. పట్టణానికి చెందిన హోప్‌స్టెప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఆమెకు వీల్‌చైర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు నాగవెల్లి శ్రీనివాస్, చంద్రమౌళి, కుశాల్, రమేశ్, ధనుశ్ పాల్గొన్నారు.

బాలికకు వీల్ చైర్‌ను అందజేస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

పిడుగు పాటుకు గేదె మృతి

డోర్నకల్: పిడుగుపడి గేదె మృతి చెందిన ఘటన పెరుమాండ్లసంకీస గ్రామం కొత్తూరు కాలనీలో శుక్రవారం రాత్రి జరిగింది. కొత్తూరు కాలనీకి చెందిన పఠాన్‌నజీయా గేదెను వేపచెట్టు కింద కట్టేసింది. శుక్రవారం రాత్రి వేప చెట్టుపై పిడుగుపడి, చెట్టు కింద ఉన్న గేదె మృతి చెందింది. గేదె విలువ రూ.80వేలు ఉంటుందని రైతు విలపించాడు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దంతాలపల్లి, అక్టోబర్ 11: మండల కేంద్రంలోని భారతి విద్యా మందిర్ పాఠశాలలో 2000–01లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు శంభారెడ్డి, సింహయ్య, నరోత్తమరెడ్డి, వెంకన్న, ప్రతాప్‌ను ఘనంగా సన్మానించారు.